ఆర్ డి టి

# ఎకాలజీ సెంటర్, అనంతపురం.

## 2004 మార్చి మాసపు సమాచారం

FOR PRIVATE CIRCULATION ONLY

## మీరు గమనించారా !

### ఎండోసల్ఫాన్‌వల్ల జరిగే అనర్థం

విచక్షణారహితంగా ఎండో సల్ఫాన్ సంవత్సరాలుగా పిచికారి చేయడంవల్ల మగపిల్లలలో లైంగిక సామర్థ్యం పెరుగుదల ఆలస్యమవుతుందని శాస్త్రవేత్తల పరిశీలనలో వెల్లడైంది. కేరళలోని కాసరగోడ్ జిల్లాకు సంబంధించిన పాద్రే అన్న గ్రామానికి చెందిన 619 మంది మగ పిల్లలమీద ఎండో సల్ఫాన్ ప్రభావాన్ని పరీక్షించిన NIOH అనే సంస్థ తన పరిశీలనలో వెల్లడించింది.

### ఐరోపా యూనియన్ దేశాలు 320 రకాల పురుగుమందుల నిషేధం :

ఐరోపా యూనియన్ దేశాలు 320 రకాల పురుగుమందుల దిగుమతుల్ని నిషేధించినట్లుగా చైనా తన దేశ రైతులను, ఉత్పత్తిదారులను హెచ్చరించింది. ఇందులో 60 రకాలను చైనా దేశమే ఉత్పత్తి చేస్తోంది.

### ఉత్తరాంచల్ రాష్ట్రంలో రసాయనిక మందుల, ఎరువుల వాడకాన్ని నిలిపివేస్తున్నారు :

ఈ మధ్యనే కొత్తగా ఏర్పడిన ఉత్తరాంచల్ రాష్ట్రంలో రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకుండా సేంద్రియపు ఎరువుల వ్యవసాయాన్నే ప్రోత్సహించబోతున్నామని ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.యస్.తోలియా ప్రకటించారు. తమ రాష్ట్రంలో జన్యు మార్పిడి విత్తన పంటలను కూడా అనుమతించబోమని ప్రకటించారు.

(డౌన్‌టువర్త్, డిశెంబర్31, 2003)

**చిట్కా :** ఆరుతడి క్రింద వేసిన వేరుశనగకాయలను విత్తనము కొరకు తీయదలిస్తే, వాటిని నీడయందు ఆరబెట్టవలెను. తీక్షణమైన ఎండలో ఆరబెడితే మొలక శాతం బాగా తగ్గిపోతుంది.

## వాటర్‌షెడ్ గ్రామాలకు చెందిన ప్రియమైన సోదర సోదరీమణులకు నా నమస్కారములు

మనం అమలుచేస్తున్న వాటర్‌షెడ్ కార్యక్రమాల మార్గదర్శంగా ఈ లేఖ మీకు ఉపయోగపడుతుందని భావిస్తూ ఉన్నాను.

వాటర్‌షెడ్ కార్యక్రమాల అమలుతో మన గ్రామాలలో ఎంతో పురోగతి సాధించాము. మనం చేస్తున్న కార్యక్రమాల్ని ఇతర ప్రాంతాల నుండి వేలాదిమంది వచ్చి చూసి, ఇటు సంస్థను, అటు గ్రామాల ప్రజలను అభినందిస్తున్నారు. ఐతే, మన గ్రామాలలో సంపూర్ణ గ్రామాభివృద్ధి సాధించడానికి మీ పాత్ర ఇంకా ఎంతో నిర్మాణాత్మకంగా పెరగాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా ఒకసారి మనం మన ఆశయం ఏమిటి?, మనకున్నటువంటి అవకాశాలు ఏమిటి? అని గుర్తుచేసుకొంటే మంచిదని భావిస్తున్నాను.

మన అనంతపురం జిల్లాలో వాటర్‌షెడ్ కార్యక్రమాల అవసరం చాలా ఉంది. కానీ, వాటర్‌షెడ్ కార్యక్రమాలే మన గ్రామాలలో ఉన్న కరువు, దారిద్ర్యం, విద్య, ఆరోగ్యం, వ్యవసాయంలాంటి అన్ని సమస్యలను పరిష్కరింపజాలవు. కాబట్టి, వాటర్‌షెడ్ కార్యక్రమాలకు మించి అదనంగా మన కృషి కొనసాగవలసి ఉంటుంది. ఆ మార్గంలో వాటర్‌షెడ్ కార్యక్రమాలను మనం ఒక ఆధారంగానూ ఒక అవకాశంగానూ, తీసుకొని ఎన్నో ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంది. గ్రామాలలో నిజంగా గాంధీ మహాత్ముడు ఆశించిన "గ్రామ స్వరాజ్యం" స్థాపించడానికి వాటర్‌షెడ్ కార్యక్రమాలు కారణభూతం కావాలి. గాంధీ మహాత్ముని ఉద్దేశ్యంలో గ్రామ స్వరాజ్యం అన్నప్పుడు- గ్రామస్థులు వారికి అవసరమైనటువంటి నిర్ణయాలను వారే చేయగలిగి, వాటిని సమిష్టి కృషితో అమలుజరిపి, గ్రామంలో కరువు, దారిద్ర్యంలాంటి సమస్యలను పారద్రోలడం, విద్య ఆరోగ్యం, వ్యవసాయం పరిశుభ్రత, ఋణసౌకర్యం, గ్రామీణ పరిశ్రమలు....

(తరువాత 2వ పేజీలో)

లాంటి సౌకర్యాలు కలుగజేసుకోవడం. ఆ విధంగా "గ్రామ స్వరాజ్యాన్ని" స్థాపించడానికి గ్రామస్థులందరూ కృషి చేయవలసి ఉంటుంది. ప్రభుత్వాల నుండి తగిన సహాయ సహకారాలను సమర్థవంతంగా అందుకోవలసి ఉంటుంది. దేశ పౌరులుగా, గ్రామ ప్రజలుగా మన బాధ్యతను గ్రామంలోని నాయకులు, ప్రజలు అందరూ కలిసి పార్టీ రాజకీయాలకు, వర్గాలకు, కులాలకు, మతాలకు అతీతంగా కృషిచేయవలసి ఉంటుంది. మనకు ఉన్నటువంటి ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాస్వామ్య మనుగడకు పార్టీ రాజకీయాలు అవసరమే. కానీ, అవి ఎన్నికలకు మాత్రమే పరిమితం కావాలి. గ్రామ స్థాయిలో అవి అభివృద్ధి నిరోధకాలుగా మారకూడదు.

ఈ దిశలో మనం మన గ్రామాలలోనున్న నిరక్షరాస్యత, అనారోగ్యం, ఋణభారం, నిరుద్యోగం, అపరిశుభ్రత మొదలగు వివిధ సమస్యలను గుర్తించాలి. ఈ సమస్యలను గుర్తించడంలోనూ, వాటికి పరిష్కార మార్గాలు వెతకడంలోనూ, గ్రామాల్లో మంచి చర్చ జరగాలి. ఈ చర్చలో అన్ని వర్గాలవారు పాల్గొనాలి. ముఖ్యంగా యువకులు, విద్యావంతులు, నాయకులు చొరవ చూపాలి. గ్రామ పంచాయితీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, విద్యా కమిటి, కో-ఆపరేటివ్ సొసైటీ, నీటి వినియోగదారుల సంఘం, మహిళా గ్రూపులు, రైతుమిత్ర గ్రూపులు మొదలగు గ్రామ సంస్థలు చురుకుగా పాల్గొనాలి. అటువంటి చర్చలద్వారా పరిష్కారమార్గాలు అన్వేషించి అందుకు అనువైన నిర్ణయాలు తీసుకోవాలి. ఆ నిర్ణయాలు పారదర్శకంగానూ, ఆమోదయోగ్యంగానూ, ఆచరణ సాధ్యంగానూ ఉండాలి. మరి ఆ సమస్యలను పరిష్కరించడంలో గ్రామస్థులు చేయగల్గినవన్నీ వారే సమిష్టి కృషితో, అందరి సహకారంతో చేయగలగాలి. సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం, ఇతర సంస్థల సహకారం కూడా అవసరం కావచ్చు. అటువంటి సహకారాన్ని ప్రభుత్వం నుంచి లేదా ఇతర సంస్థల నుంచి సమర్థవంతంగా రాబట్టవలసి వుంటుంది. ఇదికూడా ఎంతో అవసరం. మన గ్రామాలలో గ్రామాభివృద్ధికోసం ఎన్నో గ్రామ సంస్థలు ఇప్పటికే వున్నాయి.

ఆ గ్రామ సంస్థలు ఒకస్థాయిలో పనిచేస్తూ ఉంటాయి. ఆ గ్రామసంస్థలు పనిచేసేటటువంటి స్థాయిని, వాటి సామర్థ్యాన్ని పెంచవలసి ఉంటుంది. ఆ గ్రామ సంస్థలు ఏ ఉద్దేశ్యంతో స్థాపించబడినాయో, ఆ ఉద్దేశ్యాలు నెరవేర్చడానికి వాటిద్వారా నిర్మాణాత్మక కృషి చేయాలి. ఆ విధంగా ఆ సంస్థలు పనిచేయుటకు అవసరమైన పూర్తి సహకారాన్ని ప్రజలు, ఇతర నాయకులు అందించాలి. అప్పుడే గ్రామాలలో ఉన్న అన్ని సంస్థల పనితీరు మెరుగై, వాటివల్ల గ్రామసమస్యలు తీరుతాయి. గ్రామాభివృద్ధి కార్యక్రమాలలో ఉన్నటువంటి గ్రామ పెద్దలతోబాటు యువకులు కూడా చాలా నిర్మాణాత్మకమైనటువంటి పాత్ర పోషించవలసి ఉంటుంది. యువకులలో ఉన్నటువంటి నిర్లిప్తతను పారద్రోలి, వారిలో అణగారియున్న శక్తి, నైపుణ్యాలను, ఆవేశాన్ని, ఆలోచనలను బయటకులాగి నిర్మాణాత్మకంగా గ్రామాభివృద్ధి కోసం వినియోగించాల్సి ఉంటుంది.

ఈ దిశలో మీ గ్రామాలలో కృషి జరగాలని నేను కోరుతున్నాను. మీ గ్రామంలోని అన్ని సంస్థలూ సమర్థవంతంగా పనిచేయాలని కోరుతున్నాను. మొదటగా మీరు మీ గ్రామాలలో ఉన్న సమస్యలను గుర్తించండి. మరి వాటికి పరిష్కారాలు ఏమిటో చర్చించి నిర్ణయించండి. అలాగే స్థానిక గ్రామ సంస్థల పనితీరును పరిశీలించండి. ఆ గ్రామ సంస్థల ఆశయాలకనుగుణంగా అవి నడుస్తున్నాయో లేదో పరిశీలించండి. అందరికీ ఆమోదయోగ్యంగా వాటిని ముందుకు నడిపించడమెలాగో ఆలోచించండి. గ్రామాభివృద్ధి కోసం తీసుకున్న సమిష్టి నిర్ణయాలను అమలుచేయడానికి మీరందరూ కృషి చేయండి. ఈ విధంగా ప్రతి గ్రామం "గ్రామ స్వరాజ్య" దిశలో ముందుకు పోగలదని ఆశిస్తూ....

మీ విశ్వాసపాత్రుడు

**వై. వి. మల్లారెడ్డి**

డైరెక్టరు - ఎకాలజి

## ఈ మాసంలో వ్యవసాయం

### ఈ మాసమునందు పండ్లతోటలలో చేయదగ్గ పనులు :

- నాలుగు సంవత్సరములలోపు వయస్సు మామిడి మొక్కలోని పూతలను గిల్లివేయవలెను. లేకపోతే పూతవలన మొక్క ఎదుగుదలకు ఆటంకము కలుగుతుంది.
- మామిడి మొక్కల యొక్క అంటు భాగము దిగువన వచ్చియున్న యిగురులను, కొమ్మలను లేత దశలలోనే ఎప్పటికప్పుడు తీసివేయవలెను. లేనియడల వేరు మూలము నుండి వచ్చు కొమ్మలు బలపడి అంటు మొక్కను పెరగనియ్యకుండా క్షీణింపచేస్తాయి.
- ప్రతి మొక్కకు పాదులోని మట్టిని కలియ త్రవ్వి, కలుపు నివారణచేసి పాదిని సక్రమముగా ఉంచాలి. పాది పైన గులకరాళ్ళతోగాని, ఆకులతోగాని కప్పి ఉంచితే పాదులనుండి తేమ తొందరగా ఆవిరికాదు. కలుపు మొక్కల బెడద చాలావరకు తగ్గుతుంది.
- నెలకొకసారి క్లోరిపైరిఫాస్ అను కీటకనాశిని ఒక లీటరు నీటితో కలిపి ప్రతి మామిడి మొక్క తడిసేటట్లు పిచికారిచేయుటవలన లేత యిగుర్లను ఆశించే పురుగులను నివారించటమేగాక, చెదలను కూడా నివారించవచ్చు.

### పూల గుత్తుల మరియు లేత యిగురులపై పురుగు నివారణ :

- 5 సంవత్సరములు, ఆపైన వయసుగల మామిడి మొక్కల పూలగుత్తులపైనా, లేత ఆకులపైనా గుంపులు, గుంపులుగా తేనె మంచు పురుగులు చేరి రసం పీల్చుటవలన పూలు మాడిపోతాయి. ఈ పురుగులు విసర్జించిన ఆకులపైన తేనెలాంటి పదార్థముపైన నల్లని మసి ఏర్పడి కిరణజన్య సంయోగక్రియకు కూడా ఆటంకము కలుగుతుంది. దీని వలన నాణ్యత, దిగుబడులు తగ్గుతాయి. ఈ పురుగు దాడి ఎక్కువగా ఉంటే 60 శాతం వరకూ పంటనష్టం జరగుతుంది. ఈ పురుగు నివారణకు తొలిదశలోనే ఇమిడా క్లోప్రిడ్ 50 మి.లీ. లేదా 600 గ్రా. కార్బరిల్ మందులతో ఏదైన ఒకదానిని 200 లీటర్ల నీటితో కలిపి వారంరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. రెండవసారి మందు మార్చవలసి వుంటుంది. పిచికారి చేసేటప్పుడు ముందు చెట్టు మొదలు, తరువాత పెద్ద కొమ్ములు, మరియు రెమ్మలు ఆకులు, పూలగుత్తులు తడిసేటట్లు పిచికారి చేయాలి.

### ప్రొద్దుతిరుగుడు :

ప్రొద్దుతిరుగుడు పువ్వు ఫిబ్రవరి నెల 15వ తేది నుండి మార్చి 15వ తేది వరకు విత్తిన వాటికి, వెర్రితెగులు (వైరస్) సోకి పంటకు విపరీతముగా నష్టము కలిగే అవకాశం ఉంది. కావున వేసవిలో మార్చి 15వ తేదీ తరువాత ఈ పంట సాగు చేసుకోవాలి.

### వేరుశనగపై పొగాకు లద్దెపురుగు నివారణ

పొగాకు లద్దెపురుగు వేరుశనగ ఆకులుతినడంవలన కాయల ఉత్పత్తికి పెద్ద నష్టము లేకపోయినా, పశుగ్రాశము దిగుబడి తగ్గుతుంది. అయితే దీని నివారణకు పురుగు మందులకు బదులు ఎర ద్వారా ఈ పురుగును నివారించుట చాలా సులభం. ఆర్థికంగానూ, పర్యావరణరీత్యానూ లాభకరం.

* * * *

### ఎర తయారుచేయు పద్ధతులు

5 కేజీల తవుడు, అరకిలో బెల్లము, 500 మి.లీ. మోనోక్రోటోఫాస్ తీసుకోవాలి. అరకిలో బెల్లాన్ని ఒక లీటరు నీటితో పాకంపట్టి, చల్లార్చి 5 కేజీల తవుడు, 500 మి.లీ.లపై మందుతో బాగా కలిపి, చిన్న చిన్న ఉండలు చేసి సాయంకాలముపూట పొలమంతా పెట్టవలెను. ఈ ఎరలోని బెల్లంపాకు వాసనకు ఈ లద్దెపురుగు ఆకర్షింపబడి తిని చనిపోతాయి.

* * * *

### వాటర్‌షెడ్ గ్రామాలలో ఈ మాసం చేపట్టాల్సిన పనులు

1. భూసార మరియు తేమ పరిరక్షణ పనులకు గానూ, రైతులు ముందస్తుగా చందాలు వాటర్‌షెడ్ కమిటీకి చెల్లించాలి.
2. యస్.టి.ఓ.లు సర్వేలు ప్రారంభించి ప్లానులు, అంచనాలు తయారుచేసి, కుంటకట్లు పనులు చేపట్టాలి.
3. ఈ నెలలో గ్రామ సభలు జరగాల్సి ఉంటుంది.

* * * *

### రాజులగుడి తలిపిరి మరమత్తు

కంబదూరు మండలం తిప్పేపల్లి గ్రామంలోని రాజులగుడి తలిపిరిని 2002 సం॥లో ప్రభుత్వనిధులతో మరమ్మత్తుచేయడం జరిగింది. ఇది 50 సం॥ క్రితం త్రవ్వినట్లుగా అంచనా. గత 12 సం॥ నుండి పూర్తిగా నిరుపయోగంగా ఉండేది. దీని రిపేరుకు అయిన ఖర్చు రూ. 50 వేలు. ఈ తలిపిరి మరమత్తు వలన ఆ సంవత్సరం కురిసిన వర్షాలకు ప్రత్యక్షముగా 18 ఎకరాలు సాగుబడిలోకి వచ్చింది. ఇందులో 3 యస్.సి. మరియు 9 బి.సి. కుటుంబాలవారున్నారు. పరోక్షంగా 75 ఎకరాలకు ప్రయోజనం చేకూరింది. 15 బోరు బావులలో నీళ్ళు వచ్చినాయి. పశువులకు, పక్షులకు నీటి వసతి కలిగింది. మన పెద్దలు మనకు ఇచ్చిన నీటి వనరులను మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందికదా !

## తక్కువ నీటితో ఎక్కువ పంటలు తీయడమెలా ?

మన జిల్లాలో నీటికరువు ఏపాటిదో మీకు తెలిసే వుంటుంది. ఇటువంటి పరిస్థితులలో ఎక్కువ నీరు అవసరం అయ్యే పంటలు పండించడంకంటే తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండించే పద్ధతుల గురించి మనం ఆలోచించాలి. వివిధ పంటలకు అవసరమయ్యే నీరు, పెట్టుబడి, విస్తీర్ణం, ఖర్చులను గమనించండి

| క్రమ సంఖ్య | ఒక హెక్టారుకు కావలసిన నీటి పరిమాణము (మి.మీ.లలో) | వరి | జొన్న | రాగి | వేరుశనగ | ప్రొద్దు తిరుగుడు | కంది |
|---|---|---|---|---|---|---|---|
| 1. | కావలసిన నీటి పరిమాణం (మి.మీ.) | 1200 | 500 | 250 | 500 | 400 | 300 |
| 2. | ఒక హెక్టారు వరికి అవసరమయ్యే నీటితో పండించగల విస్తీర్ణం | 1.0 | 2.4 | 4.8 | 2.4 | 3.0 | 4.0 |
| 3. | హెక్టారుకు అయ్యే పంటసాగు ఖర్చు (రూపాయలలో) | 10,000 | 4,000 | 2,500 | 10,000 | 6,000 | 6,000 |
| 4. | హెక్టారుకు దిగుబడి అంచనా (టన్నులలో) | 4.0 | 2.5 | 2.0 | 2.0 | 1.5 | 1.5 |
| 5. | హెక్టారుకు గరిష్ఠ రాబడి అంచనా (రూపాయలలో) | 16,000 | 7,500 | 6,000 | 20,000 | 18,000 | 18,000 |
| 6. | అంచనా వేయబడిన లాభం హెక్టారుకు (రూపాయలలో) | 6,000 | 3,500 | 3,500 | 10,000 | 12,000 | 12,000 |
| 7. | హెక్టారు వరిపైరుకు సరిపోయే నీటితో సాగయ్యే పంటల లాభం అంచనా (రూ.) | 6,000 | 8,400 | 16,800 | 24,000 | 36,000 | 48,000 |
| 8. | విద్యుత్ ఖర్చు (యూనిట్లలో) | 900 | 375 | 187 | 375 | 300 | 225 |

**మూలం : వాలంతరీ, హైదరాబాద్**

## వివిధ పంటల్లో నీరు అవసరమయ్యే కీలకదశలు

| సం. | పంట | తేమ సున్నిత దశలు |
|---|---|---|
| 1. | వరి | పిలకలువేసే పూత, పాలు పోసుకునే దశలు |
| 2. | జొన్న<br>మొక్కజొన్న | పూత, కంకులు బయటకువచ్చు,<br>గింజ పాలు పోసుకునే దశలు |
| 3. | సజ్జ | కంకులు ఈనడం మొదలుకొని పూర్తిగా పుష్పించే వరకు |
| 4. | రాగి | చిరుపొట్టదశ, పూతదశ |
| 5. | వేరుశనగ | పూతదశ, ఊడలుదిగేదశ, గింజ తయారయ్యే దశ |
| 6. | ప్రొద్దుతిరుగుడు | మొగ్గతొడిగే దశ, పూతదశ, గింజలు ఏర్పడే దశలు |
| 7. | కుసుమ | మొగ్గతొడిగే దశ నుంచి పూత దశ వరకు |
| 8. | సోయాచిక్కుడు<br>పెసర/మినుము/కంది | పూత దశ, గింజ ఏర్పడేదశ |
| 9. | పత్తి | పూతదశ, కాయలు వృద్ధిచెందే దశ |
| 10. | చెరకు | పంట నిలదొక్కుకునే దశ |
| 11. | మిరప/బెండ/వంగ | పూతదశ, కాయ పెరిగే దశ |
| 12. | ఆలుగడ్డ / ఉల్లి | గడ్డ ఊరేదశ |
| 13. | టొమాటో | పూత, కాయ ఎదిగేదశ |
| 14. | బఠాని | పూత దశ మొదలు కాయలు వృద్ధి చెందేవరకు |
| 15. | క్యాబేజి | గడ్డ తయారయే దశ |
| 16. | క్యారెట్ | వేరు పెరిగే దశ |

**మూలం : అన్నదాత – ఫిబ్రవరి 2004**

## "శ్రీ" వరి సాగు

'శ్రీ' వరి సాగు పద్ధతిని ఈ దిగువ చోట్ల అమలుపర్చి ఉన్నారు. వరి పండించే రైతులు దీనిని చూడడం చాలా అవసరం.

1. ఆర్.డి.టి. ఫారం, ములకనూరు, కంబదూరు మండలం.
2. ఆరవేటి వెంకటేశులు, మల్లిపల్లి, కళ్యాణదుర్గం మండలం.
3. ప్రకాష్‌రెడ్డి, కణేకల్లు, కణేకల్లు మండలం.
4. సి. రాధా క్రిష్ణయ్య, గోళ్ళపల్లి, రాప్తాడు మండలం.
5. పి. శ్రీనివాసరెడ్డి, మర్తాడు, గార్లదిన్నె మండలం.

**ప్రచురణ: డైరెక్టరు – ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం – 515 002.**

**☎ 08554 – 244222 / 246884, ఫ్యాక్స్ : 08554 – 244990**